కథానిక

# అతడు-ఆమె-నేనూ

"భాస్కరభట్ల"

ఆరోజు ఉదయం అప్పుడే లేచి, కాఫీతాగి పేపర్ తిరగవేస్తున్నాను. పనిమనిషివచ్చి, తపాలావాడు వచ్చాడని చెప్పింది. ఉత్తరాలు ఉంటాయి.అడిగి తీసుకురమ్మన్నాను. లేదు, నాకివ్వడము లేదంది.అప్పుడేముట్టించిన సిగరెట్టుతో పడక కుర్చీలోంచి లేచి, పొగల్ని వెంటబెట్టుకొని, ఒక్కొక్కటిగా మెట్లు దిగాను, పైగదిలోంచి పొగలు నాతో బయల్దేరి, కళ్ళను కమ్మివేసి, దారిని మసకమసకగా మార్చాయి. నెమ్మదిగా వెలుపలి గుమ్మంవరకు వెళ్ళేసరికి, టెలిగ్రాం వచ్చిందని తపాలావాడు హెచ్చరిక చేసాడు. ఆ హెచ్చరికకు కాస్త వళ్లు పులకరించింది. మౌనంగా టెలిగ్రాం అందుకొని, కాగితంపైన సంతకం చేసాను. ఆతురతగా టెలిగ్రాం విప్పాను.

ఆమె మరణించిందని, అతని దగ్గరినుంచి టెలిగ్రాం... ఎందుకో హృదయం కళవళ పడలేదు. ఇంత దుర్వార్తవిన్నా, హృదయం ఎందుకో చలించడం లేదని, నామట్టుకు నాకే ఆశ్చర్యం వేసింది. గంభీరంగా మేడమెట్లు ఎక్కి పైగదిలోకి లోకి వెళ్ళాను. నన్ను ఆవరించిన పొగలు, వెన్నాడడం మానుకున్నాయి.

గదిలో పడకకుర్చీ జేర్లగిలబడ్డాను. పొగలకు మల్లే ఆలోచనలు మెదడులోంచి లేచి క్రమంగా గదిని ఆవరించాయి. ఉత్తర క్షణంలో నన్ను శూన్యంలోకి నడిపించాయి. శూన్యంలో ఆమె వదనం తళుక్కున మెరిసింది. ఆ కళ్ళల్లో ఏవో ఆలోచనలు మొలకలెత్తుతున్నాయి. వాటి ప్రతిధ్వనులు, పెదిమలపైన ప్రతిఫలిస్తున్నాయి. ఆమె పెదిమలు క్రమంగా విడిపడుతున్నాయి, అది చిరునవ్వు ఎంతమాత్రం కాదు. దానిలో ప్రశాంతత లేదు-మైత్రిలేదు-ఒక ఆశ్రయంకూడా కనపడదు. ఎందుకో ఆనవ్వు, నన్ను దూరతీరాలకి తరిమికొడుతున్నట్లు కనపడింది. నా నిస్సహాయతనీ, నా దైన్యాన్నీ, వెయ్యిరెట్లు అధికంచేసి, నన్ను అపహాస్యం చేస్తున్నట్లు తోచింది. ఆమె చచ్చికూడా నాపైన పగసాధిస్తున్నట్లు కనపడింది. కళ్ళముందు నించి, బలవంతంగా ఆమె చిత్తర్వుని తుడ్చివేశాను. ప్రయత్న పూర్వకంగా, నిజ ప్రపంచంలోకి వచ్చి, ఆమె స్మృతి చిహ్నాలని వినాశనం చేయక తప్పదని, నిశ్చయించుకున్నాను. నా ముందువున్న డ్రాయర్ సొరుగులో చెయ్యిపెట్టాను. ప్రాణప్రదంగా దాచిపెట్టుకున్న వుత్తరాలు, మునివేళ్ళకి తాకి శరీరాన్ని పులకరింపజేసింది. పూర్వ స్మృతుల్ని జ్ఞాపకానికి తెచ్చింది. హృదయానికి ఎదురు తిరిగి, వెంటనే ఆ ఉత్తరాల కట్టని చించివేయ దలచాను.

వద్దు, వద్దని హృదయం చీత్కారంచేసింది. ఒకమాటు చదివినంతమాత్రాన వచ్చే ప్రమాదం ఏమీలేదని, మెదడు విజ్ఞప్తిచేసింది. విధిలేక ఉత్తరాల కట్ట విప్పాను. కట్టలోఎన్నో వుత్తరాలు లేవు. మచ్చటకు మూడేవున్నాయి.

మొదట నేను వ్రాసిన ఉత్తరంతీసి చదవడం ప్రారంభించాను.

ఉదయం వెళ్ళిపోయేననగా, ఆరాత్రి నన్ను కలుసుకోవడానికి వచ్చావు. అప్పుడు దాదాపు రాత్రి 12గంటల అయివుంటుంది. ఆరాత్రి నేను జీవితంలో ఎన్నటికీ మరిచిపోలేదు. బయట గాఢాంధకారం-నీవు తలుపుతట్టడంతోనే, శరీరాన్నే నడకగా మార్చి తలుపు తీసాను. తలుపుతీసానో లేదో, వెలుపలి గాఢాంధకారం-నా హృదయంలో ప్రవేశించింది. చీకటిలో గిలగిలలాడే పిల్లవానికి మల్లే హృదయం తల్లడిల్లింది. భవిష్యత్తులో నేను అనుభవించవలసిన 'ఒంటరితనం'నన్ను ఆవేశించి, భయపెట్టింది. ఆ భయానికి, పాదాలకిందినించి భూమి అదుటుపాటున కదిలిపోయింది. కెవ్వున కేకవేసి నిన్ను గట్టిగా పట్టుకున్నాను. నీవక్షంలో

తలదాచుకొని వెక్కి-వెక్కి- ఏడ్చాను. నా కన్నీళ్ళతో నీ వక్షం తడిసింది. రొమ్ముల సందుల్లోంచి మొహం, ఆందోళనలో పక్కకి జారినప్పుడు, నా కన్నీళ్ళని, నీ చెక్కిళ్ళమీదుగా నా చెంపలు తాకాయి. ఆ తడి నా దుఃఖాన్ని కొంతవరకు ఉపశమింపజేసింది.

మనసు కుదుటబర్చుకొని తలపైకి ఎత్తి చూచాను. నా కన్నీళ్ళని చూచి, నీ కళ్లు చిరునవ్వు నవ్వుతున్నట్లు కనపడింది. యుద్ధంలో గాయపడిన సైనికునికిమల్లే, నా హృదయం క్రుంగి కుప్పగా కూలింది. ఆ విఘాతానికి తట్టుకోలేక, "నీవు "రాక్షసి"వని తిట్టాను. దీనికి నీ పెదిమలు కళ్ళకి బదులు చిలిపినవ్వునవ్వాయి. దానితో నీవంటేనే నాకు అసహ్యమేసింది. నీవు స్త్రీవా లేక రాక్షసివా అనే అనే సందేహం పొడసూపింది. నీవు నన్ను ప్రేమించడంలేదేమో అన్న భయం, నా మెదడుని కలిచివేసింది. ఆ తరువాత నీవు నన్ను వదిలి వెళ్ళినా నీ వెకిలినవ్వు నా హృదయాన్ని వదిలి వెళ్ళలేకపోయింది. కొన్ని క్షణాలు మౌనంగా గడిచాయి. నీపై నాకుగల అసహ్యంతో నానోట మాట పెగల్లేదు. నీవు నన్ను ఓదార్చడానికి కూడా ప్రయత్నించలేదు. నీవు వెళ్ళిన తరువాత గూడా, నన్ను ప్రేమించలేదన్న సందేహం, నన్ను ఒక దయ్యంగా పట్టి బాధించింది. ఈ బాధకి తట్టుకోలేక, ఎన్నోరాత్రులు గదిలో పచార్లుచేస్తూ గడిపాను. హృదయంలేని రక్తమాంసాలతో స్నేహం చేసినందుకు, నా మెదడు నన్ను పరిహసించింది. ఎంత ఆలోచించినా, నీ తత్వమేమిటో నాకు అర్థంకాలేదు. చివరికి విసుగెత్తి, భ్రమలో అట్టే కాలం నిలువలేక, ఈ వుత్తరం వ్రాస్తున్నాను.

మనమధ్యగల దూరం మన మన స్తత్వాల మధ్య చీకట్లను తవ్వింది. సముద్రాలను అడ్డువేసింది. అరణ్యాలు పర్వతాల తెరల్ని దించింది. తిరిగి కలుసుకోవడం, నీ హృదయాన్ని తెలుసుకోవడం, అసంభవంగా తోస్తున్నది. అందువల్ల, నా హృదయారాటాన్ని ఈ ఉత్తరంలో పొందుపరిచి నీకు భద్రంగా రిజిస్టరుచేసి పంపుతున్నాను. నన్ను నీవు ప్రేమించావాలేదా అని తెలుసుకోవడం, ప్రస్తుతం జీవితంలో ఒక ముఖ్య సమస్యగా మారింది. ఈ ఉత్తరం చూచి మహోన్నతస్థాయినించి చిరునవ్వు నవ్వక, నీ హృదయాన్ని విప్పిచూపుతావుగదూ?

నీ హృదయాంతరంలోకి చొచ్చుకొనివెళ్ళి, లోని గంభీరతల్ని వెతకడానికి సాహసిస్తున్న ఒక హృదయావేదనని త్రోసివేయవుకదూ?

నీ వుత్తరం అందింది. నీ ఉత్తరం చూచి నవ్వాలో ఏడ్వాలో నాకు తోచకుండా వుంది. ఉత్తరం చదివిన తరువాత, నవ్వనూలేదు, ఏడ్వనూ లేదు. చిరునవ్వు మాత్రం నవ్వాను. నీకు కోపమొస్తుందని నాకు తెలుసు. అయినా, చిరునవ్వు నవ్వకుండా ఉండలేకపోతున్నాను.

నేను జీవితమంతా యిరువురు వ్యక్తుల్ని ప్రేమించాను. ఆ యిరువురిలో ఒకతను నన్ను గుడ్డిగా ప్రేమించాడు. అంటే, నా అందాన్ని, నామాట తీరును భ్రమిస్తాడు. అట్టి వ్యక్తికి, నేను నా స్త్రీత్వాన్ని మాత్రమే అప్పగించాను. మా ఉభయుల హృదయాలు ఎన్నడూ పెనవేసుకోలేదు. ఐక్యతలు పొందలేదు. ఉభయులం దివ్య సుఖాన్ని అనుభవించాము. అతనిపై నాకుగల ప్రేమని నేను ఎన్నడూ వ్యక్తపరచలేదు, వ్యక్తపరచవలసిన అవసరంకూడా ఎన్నడూ కలగలేదు. దైహికంగా ఒండొరులకి అవసరమైనాము. దైహికంగా పరాకాష్ఠ పొందాము. కాని అతను ఎన్నడూ నన్ను అర్థంచేసుకోవడానికి ప్రయత్నించలేదు. ఈనాటి వరకూ నేను అతన్ని ప్రేమించడం లేదనే అతని భావన — ఇక నీ సంగతి—నీది గొప్ప ఉద్వేగంతో కూడుకున్న హృదయం. మొదట నీ అమాయకత్వం, నీ ఉద్రేకోద్వేగాలు నన్ను ఆకర్షించాయి. నీ అమాయకత్వాన్ని చూచి నాకు చిరునవ్వు వచ్చేది. నీ లోపాలుచూచి, నా హృదయం జాలిపడేది. పరీక్ష పోయి నీవు కంగారు పడుతూంటే, నా హృదయం, రెపరెపలాడేది. నీ హృదయాందోళనని నా హృదయంలో దాచుకోవలె ననిపించేది. చిన్నతనం అందించే, ఉద్రేకంతో, నీవు చిన్నచిన్న విషయాలకి బాధపడడం చూచి, నాకు ఒకొకసారి కళ్ళనీళ్ళ పర్యంతమయ్యేది. కాని ఆదుఃఖాన్ని ఎవరికీ కనపడనిచ్చేదాన్ని కాను ఆరోజురాత్రి నిన్నువీడి వెళ్ళిపోవడమంటే, నాకెంతో కష్టంవేసింది. నా కష్టాన్ని దిగమ్రింగి, నిన్ను ఓదార్చడానికి, ఆతురతగా నీదగ్గరికి పరుగెత్తుకొచ్చాను. గాని నీ దీనస్థితి

చూచి, నాకు నవ్వు వచ్చింది. ఎంత ఆపుకోడానికి ప్రయత్నించినా అది ఆగలేదు, నీ ఉద్రేకంలో నేను వళ్ళుమరిచాను. కింకర్తవ్యతా మూఢురాలినైనాను. నేను అతనికి అర్పించిన ప్రేమకన్నా, నీకు అందజేసిన ప్రేమ చాలా అగాధమైంది. దానిలోతులు తరచిచూడడం అసాధ్యం. ఆలోతుల్లో నీవు మునకలువేసి, తత్తరపాటు చెంది నన్ను అసహ్యించుకుంటావని నాకు తెలుసు. అందుకోసం ఆ గంభీరతల్లోకి నీకు దారి చూపలేదు. జీవితాంతం వరకూ దారి చూపకుండా వుండడానికి నిశ్చయించుకున్నాను. కాని లాభంలేక పోయింది. విధి నన్ను దూరతీరానికి లాక్కొచ్చింది. ఇక తిరిగి కలుసుకోలేమన్న అధైర్యం ఏర్పడింది. ఇంతలోకే, నన్ను కళవరపెడుతూ నీ ఉత్తరం వచ్చింది. వయస్సుమళ్ళిన కొద్దీ నీ ఉద్రేకంతగ్గి, నన్ను అర్థంచేసుకోగలవనే ఆశ, నీ ఉత్తరం చదువడంతో అడుగంటింది. పూర్వ జీవితం, స్మృతి పథంలో విహరించడంతప్ప వాస్తవిక స్వరూపం దాల్చదనే, అధైర్యం కలిగింది. వయస్సుకూడా నిన్ను మార్చలేకపోయిందని తోచి, నీపైన అమితమైన జాలికలిగింది. ఆ జాలిలో ఈ ఉత్తరాన్ని వ్రాస్తున్నాను. కొంతవరకు నా హృదయాన్ని విప్పి నీముందు పెట్టగలిగానన్న సంతృప్తి, నా కలాన్ని ముందుకు నడుపుతున్నది. నేను నిన్ను హృదయపూర్వకంగా ప్రేమిస్తున్నాను. నీవు నా ప్రతి ఉచ్ఛ్వాస నిశ్వాసంలో నిండివున్నావు. నీవు నాకు ఒక పెన్నిధివి- నిన్ను కోల్పోయి నేను బ్రతకలేను. నా భావాలలో నా అభిరుచులలో నీవు మెలగుతావు. మానవ హృదయంలోగల లోపాలు, కంట బడడంతోనే, నీ రూపం నా కట్టెదుట బడుతుంది. నా పెదిమలపైన చిరునవ్వు చిలకరింప జేస్తుంది కాని మీ రుభయులూ, నన్ను ఎన్నడూ అర్థం చేసుకోలేదు. పైగా నా మౌనాన్ని మీరు అపార్థం చేసుకున్నారు. కొందరికి, తమ ప్రేమని వ్యక్తపరచడం తెలియదు. ఆ విధంగా వ్యక్తం చేయడం, చిలిపితనం అని కూడా భావిస్తారు. నాకు నీ ప్రేమ ఉందని గట్టిగా అరిస్తే, ప్రయోజనం ఏముంటుందో చెప్పు-ఆ విధంగా అరిచినా, అది అరణ్యరోదనంగా మారుతుంది. బహుశా నా చేతులలో కూడా నాకు మీపైగల ప్రేమని నేను వ్యక్తపరచలేక పోయాను. బహుశా అది నా బలహీనతే కావచ్చు నీకు మల్లే అతను కూడా నన్ను తప్పుగా అర్థం చేసుకున్నాడు. ఒకమాటు నేను తల్లిగారింటికి వెళ్ళినప్పుడు అతను నాకు వ్రాసిన ఉత్తరాన్ని, దీనితో జతపరుస్తున్నాను. దాన్ని, ఈ ఉత్తరంతో జతపరిచి చదివితే, నే నెంత అభాగినినో, నీకే అర్థమవుతుంది. జీవితంలో నన్ను ఎవ్వరూ అర్థం చేసుకోలేదన్న బాధ, కొంతవరకు తగ్గుతుంది. అతనికి నా శరీరం కావాలి. నా అందం కావాలి. భార్యగా అతనికి వాటిని అప్పగించాను. ఇక మిగిలింది. హృదయం-దానిని నీకు ఇస్తున్నాను. స్వీకరించు-గాయపడకుండా. నీ హృదయంలో పదిలపరుచుకోవడం నీ విధి-చివరకి.

అతని ఉత్తరం ప్రారంభించాను.

నిన్ను ఏమని సంబోధించాలో నాకేమీ తోచడంలేదు. "ప్రియమైన" అని వ్రాయడానికి, మనస్సు ఒప్పుకోవడంలేదు. అందువల్ల ఏ సంబోధన లేకుండానే ఉత్తరం వ్రాస్తున్నాను. నీవు నన్ను ప్రేమిస్తున్నావో, లేదో నాకు తెలియదు. ప్రేమించడం లేదనే. నా ఉద్దేశం. నీ చేతల ద్వారాగానీ, మాటలద్వారాగానీ, ఈ విషయం నీవు ఎన్నడూ వ్యక్తపరచలేదు. వ్యక్తపరచడం నీకు చేతకాదని, నేను విశ్వసించలేను. విధేయతని కనపరుస్తావు. నా సౌఖ్యంకోసం తల్లడిల్లుతావు. ఉదయం లేచిందిమొదలు, సాయంత్రం పక్కమీద మేను వాల్చేవరకు, కష్టపడతావు. నాకోసం, యింట్లో అన్ని సౌకర్యాలు అమరుస్తావు. ఎక్కడా ఏమీ కొరత కనపడదు. హృదయంలోకి చొచ్చుకొని వెళ్ళి, నా కోరికలన్నీ నెరవేరుస్తావు. ఎందుకో, ఎక్కడో, ఏదో లోటు ఉండాలని మనస్సు కోరుకుంటుంది. కాని కళ్ళకి ఏ లోటూ కనపడదు. వస్తువులన్నిటినీ, వాటి వాటిస్థానాలలో చూచి, ఎందుకో, హృదయం సంతృప్తి చెందదు. వస్తువుల మీదినించి, కళ్ళు నీ పైకి మళ్ళుతాయి. నీలో ఏదైనా లోటు కనిపెట్టవలెనని ఆతురత పడుతాయి. కాని కళ్ళల్లోని ఆ ఆతురత ఆతురతగానే నిలిచిపోతుంది. చివరకి హృదయంలో ఏదో చెప్పరాని ఆవేదన కలుగుతుంది. ఈ ఆవేదనని ఉపశమింప జేయడానికి

నీ దగ్గర మాటలేవీ ఉండవు. మూగ హృదయం లోంచి ఉపశమన వాక్యాలు ఆశించడం నిరర్థకంగాతోస్తుంది. నిన్ను పాయలు పాయలుగా తరిగి వేయాలన్నంత ఆగ్రహం కలుగుతుంది. కాని సాకు ఏదీదొరకదు. గిజగిజ తన్నుకుంటాను. నా బలహీనత, నా కళ్ళముందు నిలిచి, గొల్లున నవ్వుతుంది. నా నీచత్వం అప్పుడు నన్ను వేయి నాలుకలతో వెక్కిరిస్తుంది. నీ నిండు హృదయాన్ని నా ముందు నిలుపుతుంది. నా అల్పత్వం, నీ ముందు నా తలని దించేస్తుంది. పరాజయంతో కుమిలి పోతాను. ఇదీ నా స్థితి—ఈ చేతకాని తనంలో నిన్ను అమితంగా అసహ్యించుకుంటాను. నాఅసహ్యం నీలోకూడా తప్పక ప్రతిఫలిస్తుందని నా నమ్మకం. పరస్పర అసహ్యాలతో మనం ఎక్కువ కాలం జీవితాల్ని కలసి మెలసి గడుపలేమని నా ఉద్దేశం. ఈ విషయంలో నీ అభిప్రాయం తెలుసుకోవడం అనవసరమని నేను భావిస్తున్నాను. ఈ విషయాలు నీకు ముఖాముఖిగా చెప్పడం, నాకు చాలా కష్టంగా తోచింది. అందువల్ల, నీవుతల్లిగారియంటికి వెళ్ళడం, ఒక సదవకాశంగా పురస్కరించుకుని, నా హృదయాన్ని తుడ్చివేయడం నా ఉద్దేశంకాదు. కాని, నీనుంచి నిజం దాచలేకపోవడమే, ఈ ఉత్తరం వ్రాయడమనే, నా దౌర్బల్యానికి కారణం. నీదగ్గరినించి, ఈ ఉత్తరానికి సమాదానం వస్తుందని ధైర్యంలేదు. అందుకోసం జవాబు ఏమీ ఆశించడంలేదు.

ఉత్తరాలు చదివాను నా ఉత్తరం చూచిన ఆపుకోలేక పోయిందట. పైగా నన్ను హృదయపూర్వకంగా ప్రేమించిందట. నాలోపాలు ఈ అపూర్వ ప్రేమకి ఆకారమట.

ఆమె నన్ను ప్రేమించలేదు. నా లోపాల్ని ప్రేమించింది.

నాకన్నా నాలోపాలే ఆమెకు సన్నిహితమైనాయి. ఈ సంగతి మెదడులో తిరగడంతోనే ఆమెపై నాకు పట్టలేనంత కోపం వచ్చింది. ఆమె నన్ను ఎన్నడు ప్రేమించలేదు. ప్రేమించినట్టు మభ్య పెట్టింది, నన్ను పాపను చేసి లాలించి, కల్పించి నన్ను తన స్వార్థంకోసం వినియోగించుకున్నది. నా జీవితాన్ని పీడకలల పాలు చేసింది. ఇటువంటి వ్యక్తి స్మృతిచిహ్నాల్ని, నన్ను నా జీవితాంతం అనుమానపరచిన వ్యక్తి స్మృతిచిహ్నాల్ని నా దగ్గర అట్టేపెట్టుకోవడం ఘోరంగా తోచింది. వెంటనే, పుల్లగీసి, ఆ చిహ్నాలకి దహనసమస్కారం చేశాను. మంటలు గదిలో వెయ్యి నాలుకలుగా పైకి లేచాయి. నా ఉద్రేకోద్వేగాల్ని ఆ మంట వెయ్యి నాలుకలతో వెక్కిరించడం లేదుకద?

---

# మోరా ఝంఝనార్ మత్....

నజ్రుల్ ఇస్లాం

ఝంఝువలె ప్రబలుణ్ణి
ఝురివలె చంచలుణ్ణి
విధాతవలె నిర్భయుణ్ణి
ప్రకృతివలె స్వచ్ఛలుణ్ణి

ఆకాశం పగిది బాధాహీనుణ్ణినేను

బంధన రహితుణ్ణి నే
జన్మతః స్వేచ్ఛాసంచారిని,
మదీయ విముక్త చిత్తం
సహస్రదళ స్వర్గపద్మం

శ్మశానాలు నా నికేతనాలు
రాజులేదు, రాజ్యంలేదునాకు
ఆదేశాల వాసనే యెరుగను
శపించును, శాసింపబడను

ఉద్వేలనదీ సందోహలాన్ని
ఉన్మత్త జలపాత జలకలాన్ని
కలకలాన్ని! ఛలఛలాన్ని
కలఛలాన్ని! ఛలకలాన్ని

(అనువాదం: వజీర్ రహ్మాన్)